# సమస్యాపూరణం

## ప్రాచీన గాథాలహరి

### ౧

మాళవ రాజధాని ధారానగరంలో అప్పుడే సూర్యాస్తమయం అయింది. అస్తమిస్తున్న అరుణారుణ చైత్ర సంధ్యాశోభలు ధారానగర ప్రాసాద గోపురాలపై ప్రతిష్ఠించిన స్వర్ణకలశాలతో దోబూచులాడుకొంటున్నాయి.

అదే సమయంలో మాళవాధిపతి భోజరాజు రాజప్రాసాదం పై అంతస్తుపై కొలువు దీర్చి కవితాగోష్ఠిలో వినోదిస్తున్నాడు. మహారాజు దృష్టి ఎర్రఎర్రని సంజవెలుగుల సొగసులలో లీనమైపోయింది. ఆనంద తరంగితమైన అతని క్రీగంటిచూపు పక్కనే సమాసీనులైన కవీశ్వరులవైపు తిరిగింది. వారు మహారాజు భావం గ్రహించుకొని ఒకొక్కరు ఒకొక్క పాదం చొప్పున సాంధ్య వర్ణన కవిత చెప్పడం ప్రారంభించారు.

"పరిపతతి పయోనిధౌ పతంగః" అన్నాడు కృష్ణకవి. సూర్యుడు సముద్రంలో పడిపోతున్నాడని దాని భావం. అయితే అంతమాత్రంచేత ధారాధిపతికి తృప్తికలగలేదు. తిరిగీ అతనిదృష్టి కళింగకవిమీదికి తిరిగింది. వెంటనే అతడు "ఉపవన తరుకోటరే విహంగః" అన్నాడు. "ఉద్యానవనంలోని చెట్లు తొర్రలలో విహంగం ప్రవేశిస్తున్నది." అని దాని తాత్పర్యం. ఇంకా మహారాజు తృప్తి తీరలేదు. ఆపక్కనే కూర్చున్న మహేశ్వర కవివైపు దృష్టిమరలించాడు. ఆయన వెంటనే "సరసిరుహోదరేషు మత్తభృంగః" అన్నాడు. సాయంకాలం కాగానే ముడించిన తుమ్మెద తామరపూవులో పడిపోతున్నదని ఆపాదం తాత్పర్యం. భోజునికింకా సంతృప్తి కలగలేదు. కొంచెం దూరంలో కూర్చున్న కాళిదాసకవిమీద దృష్టి ప్రసరింపజేశాడు.

అతడు కొంచెంసేపాలోచించి "యువతిజనేషు శనైశ్శనై రనంగః" అని ఆ శ్లోకం పూర్తిచేశాడు. దానితో సభాస్తారులంతా ఒక్కసారిగా శిరఃకంపంచేసి బాగానని ప్రశంసించారు. అంటే సాయంకాలం కాగానే యువతీజనంలో మెల్లమెల్లగా మన్మథుడు ప్రవేశిస్తున్నాడని తాత్పర్యం. వెంటనే కాళిదాసకవి ఆశ్లోకం అంతా ఎంతో శ్రావ్యంగా పఠించాడు.

"పరిపతతి పయోనిధౌ పతంగః
ఉపవన తరుకోటరే విహంగః
సరసిరుహోదరేషు మత్తభృంగః
యువతిజనేషు శనైశ్శనై రనంగః"

శ్లోకపఠనం పూర్తిచేసేసరికి తిరిగీ సదస్యులలో హర్షామోద నినాదాలు చెలరేగాయి. వెంటనే మహారాజు తన మెడలో ముత్యాలహారంతీసి కాళిదాసకవి కంఠంలో అలంకరించాడు. సదస్యులు మహారాజు ఔదార్యం అనేక విధాలుగా ప్రశంసించారు.

అలాగ ఒక నిమిషం గడిచిన తరవాత ఆ పరిసరోద్యానవనంలో అందెల సందడి చెలరేగింది. అందరు అటువైపు చూచారు. ధారానగర వార నారీమణులా ఉద్యానవనంలో కందుక క్రీడ లాడుకొంటున్నారు. వారిలో ఒక సుందరి కందుక క్రీడలో మునిగి తేలుతూంది. అంటే ఆమె మాటిమాటికీ పైకెగిరిపడే పూలచెండు పసరి పచ్చికపై పడేటట్టుగా చేతులతో గట్టిగా కొడుతూంది. ఆమె సువర్ణకర కంకణాలు ఘలుఘల్లున మారుమోగాయి. నలనల్లని తళుకు బెళుకు చూపులు తుమ్మెదల బారులా పూలచెండువెంట నంటి పరిగెత్తాయి. అంతలో ఆమె శ్రవణాలంకారంగా అలంకరించుకొన్న నల్ల కలువపూవు తటాలున జారి ఆమె పాదాలమీద పడింది.

మహారాజు మనోజ్ఞదృశ్యం చూచి సమ్మోహితుడైనాడు. అది వర్ణించవలసిందని తిరిగీ కవీశ్వరులను ప్రార్థించాడు.

అక్కడి కవులందరు అనేక విధాలుగా ఆ మనోహర సన్నివేశం వర్ణించారు. కాని భోజుని కవేవీ నచ్చలేదు. అప్రయత్నంగా అతని కటాక్షం చిరునవ్వుతో చిందులు దొక్కుతూ కాళిదాస కవివైపు ప్రసరించింది. అతడా క్షణంలో ఈ క్రింది శ్లోకం ఆశువుగా చెప్పాడు:

"పయోధరాకార ధరోహి కందుకః
కరేణ రోషా దభిహన్యతే ముహుః
ఇతీవ నేత్రాకృతి భీత ముత్పలం
స్త్రియః ప్రసాదాయ పపాత పాదయోః"

కందుకం పయోధరాల ఆకారంధరించి వాటితో సామ్యం పొందింది. అందువల్లనే సుందరి రోషంతో ఆకందుకాన్ని అలాగ చేతులతో కొడుతూ శిక్షిస్తున్నది. నేత్రసామ్యంవలన మరి నన్నుకూడా శిక్షింపగలదేమో! అన్న భయంవల్లనే కాబోలు ఆ నల్ల కలువ ఆమె అనుగ్రహంకోసం పాదాలపై పడింది!" అని ఆ శ్లోక తాత్పర్యం.

ఆ వర్ణన వినగానే అందరు ఓహో అంటే ఓహో అని ఆనందించారు. వెంటనే మహారాజు వేరే ఒక నవరత్నహారం కవి కంఠంలో అలంకరించిసత్కరించాడు. తిరిగీ సభ్యుల సాధు వాదాలు మిన్నందుకొన్నాయి.

అంతలో కళింగకవి సవినయంగా ఇలా అన్నాడు:

"మహారాజా! పూర్వకాలంలో విక్రమాదిత్య చక్రవర్తి ఆస్థానంలో వెలిసిన కాళిదాస మహాకవీశ్వరులే తిరిగీ మన కాళిదాస మహాకవి రూపంలో అవతరించారు! దీనిలో ఏమీ అనుమానం లేదు!"

అటుపిమ్మట కృష్ణకవి మెల్లగా ఇలాగన్నాడు:

"మహారాజా! వీరు కాళిదాస కవీశ్వరుని అపరావతారం అనడం భావ్యంకాదేమో! ఆయనకంటె వీరే అత్యధికులని నా అభిప్రాయం! ఎందుచేతనంటే — ప్రాచీన మహాకవి కేవలం కాళిదాసుడే! కాని ఈ మహాకవి కాళీదాసులు! వీరి నామధేయంలోని సుదీర్ఘ దీర్ఘం వీరి మహా ఘనతకొక ఘట్టి తార్కాణ!" అని తన చమత్కృతికి తానే మురిసిపోతూ సన్నగా ఒక్క చిరునవ్వు నవ్వాడు. అతని చమత్కృతికి మహారాజంతగా ఆనందించలేదుగాని మిగిలిన కవివర్గంలో కొంతమంది బాగున్నట్లు తల లూపారు.

కాళిదాసకవి ఈ ప్రశంసకేమీ హర్షించ

పి. గణపతిశాస్త్రి

# ★ సమస్యాపూరణం ★

లేదు. పైగా దీనిలో సన్నసన్నని ఎత్తిపొడుపున్నదనీ, కృష్ణకవి అధిక్షేపించడానికే అలాగ చమత్కరించాడనీ అనుకొన్నాడు. ఆ భావనతో అతని కన్నులలో కొంచెం రక్తిమ పొడచూపింది. ఆ సంధ్యా రక్తిమలో ఆ రక్తిమ ఎవరు గమనించనేలేదు. అంతటితో నాటి కవితాగోష్ఠి ముగిసింది.

## ౨

ఆరాత్రే కృష్ణకవి గృహంలో రహస్య మంతనాలు ప్రారంభమైనాయి. వాటికి కృష్ణకవే స్వయంగా అధ్వర్యం వహించాడు. అతని మంతనాలకు కళింగమహేశ్వరకవు లిద్దరు తందానతానా అని వంతలు పాడారు.

"ఈ కాళిదాసకవిగాడెక్కడ దాపరించాడయ్యా! పులిమీద పుట్రలాగ!" అన్నాడు కళింగకవి. "ఈ పుట్ర అంతేమిటో నేను కనుక్కుంటానుగా! మీ రేమీ కంగారుపడకండి!" అన్నాడు కృష్ణకవి అతిహేలగా!

"నేను మొదటే చెప్పాను! ఇతగాణ్ణి ఒక కంట కనిపెట్టి చూడండయ్యా అని. నా మాట మీ రిద్దరు చెవిని పెట్టారా? చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏం లాభం!... ఇక మనకీ ఆ స్థానంలో పచ్చి మంచినీళ్లైనా పుట్టవు!" అన్నాడు మహేశ్వర కవి.

కృష్ణ కళింగ మహేశ్వరకవులు ముగ్గురు అంత ప్రతిభావంతులు కారు. వీరంతా చచ్చి చెడి చాయంగల విన్నపాలన్నట్టు ఎలాగో అలాగ ఒక శ్లోకం అల్లేసరికి పైనించి చుక్కలు దుల్లేవి! ఇక జీవితంలో మరి ఏపని చెయ్యడానికీ తగిన శక్తిసామర్థ్యాలులేక వీరు ముగ్గురు కవిబ్రువులై కాళ్ళకు బలపాలు కట్టుకుని ఆ స్థానాలమ్మట తిరిగి తిరిగి ఎల్లాగో అలాగ ధారానగరం చేరుకొని కొంచెం కాళ్లు నిలవదొక్కుకున్నారు. భోజమహారాజు లవలేశమైనా కవితాశక్తి కల కవులందరికీ అక్షర లక్ష లిచ్చే వదాన్యుడు. సరసుడు. వారి శక్తిసామర్థ్యా లాయనకు తెలియక పోలేదు. అయినా అపారమైన ఆ మహారాజు కవితాభిమానంలో గోరంతలైనవారి కవితా శకలు కొండంతలుగా స్ఫురించేవి. అలాగ కొంతకాలం గడిచేసరికి కాళిదాస కవి ధారానగరాస్థానం సంపర్కించడం జరిగింది. అప్పటినించీ వారు ముగ్గురు దివిటీముందు దివ్వెలై ఊరుకున్నారు. కాని ఆ దివ్వెలలో అనూయాగ్నులు దివిటీలై ప్రజ్వలించాయి! ఇటీవల జరిగిన కవితాగోష్ఠి అనంతరం ఆ దివిటీలే దావాగ్నులై ప్రజ్వలించాయి. కాళిదాసకవి కెలాగైనా దేవిడీమన్నా చేయిస్తే తప్ప మరి గత్యంతరం లేదని వారొక దృఢ నిశ్చయానికివచ్చి వేశారు. దానికోసమై వారు ముగ్గురు పరిపరి విధాలుగా తలలు పగలగొట్టుకున్నారు. కాని ఎంత సేపటికీ ఏమీ మార్గం స్ఫురించలేదు. కాళిదాసకవి కిప్పుడు భోజుని సమాపంక్తిని కూర్చుని హేమపాత్రలో విందారగించేటంతటి మహాగౌరవం కూడా కలిగింది. ఆ మహాగౌరవం తలుచుకొన్నకొద్దీ వారి గుండెల్లో కార్చిచ్చులు చెలరేగాయి!

కళింగకవి కొంచెంసే పూరుకుని ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి నెమ్మదిగా ఇలాగన్నాడు:

"ఏదైనా కాళిదాసకవికి తగుమాత్రం ప్రతిభ లేకపోలేదు! లేకపోతే దేవరవారికి ఆయనమీద అంతటి గౌరవ ప్రపత్తు లెలాగ కుదురుతాయి?"

"ఆఁ ఏమిటా ప్రతిభ! నా శిష్యులిలాంటి సమస్యాపూరణ శ్లోకాలు రోజు రోజు వేలాదిగా రాసిపారేసూంటారు! మా యింటావిడ ఆ తాటాకులు వేణ్ణీళ్లు కాచుకోడానికికూడా పనికిరావని దూరంగా విసిరి పారేస్తుంది! తెలిసిందా? ఏమిటంట ఆ ప్రతిభ?" అన్నాడు కృష్ణకవి.

"ఇచ్చకాలయ్యా! ఇచ్చకాలు! వాటితో ఈ రోజుల్లో ఎంతటి ఘనకార్యమైనా ఇట్టే సాధించవచ్చును!" అన్నాడు మహేశ్వరకవి.

"అడుగడే! ఈ కాలంలో మన ఆస్థానాల్లో ప్రతిభా పాండిత్యా లెవడికి కావాలయ్యా!" అన్నాడు కృష్ణకవి.

"ఏదైనా మహారాజు ఆయనంటే పంచప్రాణాలు ఇచ్చేస్తున్నాడు! ఇహ మనమెంత గిలగిల్లాడి గింజుకున్నా ఇంతే!" అన్నాడు కళింగకవి.

"అంతేనంటావా! చూడు నాతడాఖా!" అని గర్జించాడు కృష్ణకవి.

కృష్ణకవి చాలా పొడగరి. అతని ప్రతిభ కూడా అలాంటిదేఅని ఆయన శిష్యులంటారు గాని, కంచుకాగడా వేసినా అది అతని కవితలో ఎక్కడా స్ఫురించదు! కాని ప్రభువర్యులను బుట్టలో వేసుకోవడంలో అతిగాడు గట్టిదిట్ట! కొంతకాలం నుంచీ అతడా శక్తితోనే కొట్టుకువస్తున్నాడు.

ఇక కళింగకవి చాలాపొట్టి. అతనివి తేనెరంగుకళ్లు. కనుగుడ్లు చిన్న చిన్న చింతగింజల్లా కనిపిస్తాయి గాని వాటి లోలోపలి భావాల లోతులు మొసళ్లకేగాని తెలియవని ధారానగరంలో చెప్పుకుంటారు.

ఇక మహేశ్వరకవి, ఇతడంతగా పొడుగూ కాదు, పొట్టీకాదు. లేనివన్నీ ఉన్నవని




"నేను మైకాఫీనే ఎన్నుకొనుచున్నాను"

" 15 సంవత్సరములనుంచి అన్నిటికంటె మేలని మా సంసారము మెచ్చుకొన్నది"

¼. ½. 1 పౌ. ప్యాకెట్లలో లభించును. & పౌ. 20. పౌ. 7, పౌ. 3, పౌ. 1. డబ్బాలలో లభ్యమగుచున్నది.



ప్రాతినిధ్యంలేని కొన్ని ప్రదేశాలకు ఏజెంట్లు కావలెను.

కాంట్రాక్టు:

my Coffee

మై కాఫీ కంపెని,

అమిన్ జికరై, మద్రాసు-29.

ఊహించుకోవడంలో మహా ప్రతిభాశాలి. ఆ ప్రతిభ ఓంప్రథమంగా అతని కవిత్వం మీదే ప్రసరించింది. దానితో అతడు తానల్లేదంతా మహాకవిత్వమే అనే భ్రమలో పడ్డాడు. ఆ సమయంలో కృష్ణకవి కూడా సరిగా అలాంటి భ్రమలోనే పడడం జరిగింది. దానితో వారిద్దరికీ పరస్పరసాహాయ్యం అత్యావశ్యకమై కూర్చుంది. అప్పటినుంచీ వారు పరస్పర కవితాస్తోత్రాలు ప్రారంభించారు. అవి వారికి తెలియకుండానే అతిశయోక్తులు పుణికిపుచ్చుకొని ఆకాశం తలదన్నేవి. అప్పటినుంచీ వారికి ప్రగాఢమైన మైత్రీ బంధం ఏర్పడింది. కృష్ణకవి పన్నాగాలు పన్నడంలోను, ముఖస్తుతిలా కనిపించకుండా ముఖస్తుతి చెయ్యడంలోను చాలా ఘటికుడు. మహేశ్వరకవి కలాంటి చాకచక్యాలేవీ తెలియవు. అతనిదగ్గర ఉన్న గొప్పదనమంతా ఒక్కటే.

అంతగా కవికాకపోయినా కవిలాగే కనిపిస్తాడు. అంటే అతని దృష్టిఎల్లప్పుడూ కవితాలోకాల్లోనే విహరిస్తున్నట్టు కనబడుతుంది. కాని యథార్థం అది కాదు. అది నిరంతరమైన సంసార చింతలవల్ల, పరిష్కరించడానికి తగిన శక్తి లేకపోవడంవల్ల ఏర్పడిన అలసత్వం మాత్రమే. దానితో కొంత పరధ్యానంకూడా మేళవించడంతో అతడావిధంగా కనిపిస్తాడు. ఉన్న వారందరిలో అతడే కొంత రూపసి. ఎప్పుడు కృష్ణకవిని అంటిపెట్టుకుని తిరుగుతూ అతని చెప్పుచేతల్లో ఉండడం వల్లనే మహేశ్వర కవి జీవయాత్ర కొంత సుగమంగా సాగిపోతూంది. వారిద్దరి మైత్రి నానాటికీ దృఢపడానికిది కూడా ఒక కారణమే. అంతలో హఠాత్తుగా కృష్ణకవి కళ్లు రెండు తారకల్లాగ తళ తళా మెరిశాయి. ఆ విషమసమస్యా పూరణకతని కేదో ఒక మహోపాయం స్ఫురించింది. వెంటనే మహేశ్వర కవికేసి తిరిగి ఒక చిరునవ్వు నవ్వి హేళనగా ఇలా అన్నాడు. "అన్నట్టు ఆ దాసీ పిల్ల ఇంకా మీ కాళ్లా వేళ్లా పడి తిరుగుతూందా?"

మహేశ్వరకవి ఈ ప్రశ్నతో కొంచెం చిన్నబుచ్చుకున్నాడు.

"ఎవరయ్యా ఆ తరళాయతాక్షి!" అన్నాడు కళింగ కవి.

"అదే ఆ అంతఃపురదాసి!" అని జ్ఞాపకంచేశాడు కృష్ణకవి. మహేశ్వరకవి కిప్పటి దాకా ఆవిషయమే స్ఫురణకు రాలేదు. తరవాత కొంత సేపటివరకు మాట్లాడకూరుకుని—

"ఎందుకేమిటి? ఏమిటి కథ!" అన్నాడు.

"ఇప్పుడీ ఆపత్సముద్రంలోనించి మనల్ని ఉద్ధరించగలిగినది అది ఒక్కర్తే!" మహేశ్వరకవి కదేమీ బోధపడక "ఏది నేనీమధ్యన అటుకేసి వెళ్ళడమే మానేశానే!" అన్నాడు!

"మరి ఇక్కడినించి రోజు అక్కడికి వెళ్ళి దానిని కొంచెం బుజ్జగించాలి!"

"ఎందుకు?"

"నేను చెబుతాగా!"

"అసలింతా ఎందుకో తెలియందే మళ్లీ ఈ అనవసరపు రొష్టంతా నాకెందుకయ్యా!"

"ఆ అంతఃపురదాసితో మళ్లీ కొంచెం గ్రంథం నడిపించమంటే రొష్టంటే ఎలాగయ్యా! మహానుభావా!"

కాని ఆరహస్యమేదో ముందుగా చెప్పందే మహేశ్వరకవి దానికంగీకరించలేదు.

కృష్ణకవికిక చెప్పక తప్పలేదు. సూచనామాత్రంగానే తనమంత్రాంగం కొంచెం అతనికి తెలియజేశాడు. కళింగకవి అది విని— "మీరు సాక్షాత్తు అపర చాణక్యులే! దీనితో మనమంత్రాంగం పారి తీరుతుంది! దీనికిక తిరుగులేదు!" అన్నాడు!

కాని మహేశ్వరకవి మొట్టమొదట దానికంగీకరించలేదు.

"ఏమో! ఇదంతా తిరిగి మనమీదే విరుచుకు పడుతుందేమో!" అన్నాడు.

కృష్ణకవి అతన్ని చాలాసేపు బుజ్జగించి "కవీశ్వరా! సాహసే లక్ష్మీః అన్నారు ధర్మవేత్తలు! ఆ సూక్తి విస్మరించారా?" అన్నాడు.

మహేశ్వరకవి—

"దానికి సాహసే—అలక్ష్మీః అనికూడా అర్థం చెప్పవచ్చునేమో!" అన్నాడు కొంచెం సంకోచిస్తూ.

కృష్ణకవికి తటపటాయింపుతో ఒళ్లుమండిపోయింది.

"నీవంటి దద్దమ్మలకు చివరికి తలపై విరుచుకుపడేదా పెద్దమ్మే!" అన్నాడు దురుసుగా.

ఆ ఏకవచన ప్రయోగంతో మహేశ్వర కవి మరి మాటాడలేదు! మిగిలిన ఇద్దరు కృష్ణకవి మంత్రాంగంతప్ప మరి వేరే గత్యంతరం లేదన్నారు. మహేశ్వరకవి మరి కాదనలేకపోయాడు. పిమ్మట వారిసమావేశం ముగిసిపోయింది.

## 3

అలాగ కొంతకాలం గడిచిపోయింది. ఒకనాటి రాత్రి మహారాజభవనంలో విందు జరిగింది. మహారాజు తనతో కలిసి విందారగించవలసిందని కాళీదాసకవినెంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు.

రాత్రివేళ సముజ్జ్వల దీపకాంతిలో మహారాజు కాళీదాసకవి సరసన కూర్చుని విందారగిస్తున్నాడు. ఏవేవో చిత్ర చిత్రమైన సరస ప్రసంగాలు సాగిపోతున్నాయి. పరిచారికలు వారికి కావలసిన రుచ్యపదార్థాలు వడ్డిస్తున్నారు. రాణి లీలాదేవి సరసనే కూర్చుని వారికి కావలసిన పదార్థాలేవో అతి జాగరూకతతో గమనిస్తున్నది. భోజునికి ధగద్ధగాయమానంగా వెలిగే దీపకాంతులలో లజ్జాన్వితమైన లీలాదేవి ముఖము, ఆమె కర్ణాభరణాలు, కంఠంలోని ముత్యాలహారాలు ఒక వినూతన సౌందర్యంతో మెరిసిపోతున్నట్టుగా స్ఫురించాయి. అతడొకమారు లీలాదేవి వైపు మరి ఒకమారు కాళీదాస కవివైపు జాగ్రత్తగా పరకాయించి చూచాడు. తిరిగీ యథాప్రకారంగా శరపరంపరగా ఛలోక్తులు విసురుతూ చిరునవ్వులు చిందించాడు.

పొట్టుతో కలిపి పొగిచిన పెసరపప్పు వంటకం అంటే భోజుని కెంతో ప్రీతి. ఆనాడెందుచేతనో ఆవంటకం పొట్టుతో కలిపి పొగచడం జరగలేదు. పొట్టులేనిదే అది అతనికి సయించదు. కాని కవీశ్వరుని కావిధంగా వంటకం తయారుచేస్తేగాని రుచించదేమోననే సంకోచంతో పరిచారికలా విధంగా వంటకం తయారుచేశారేమో! స్వయంగా లీలాదేవే వంటకం ఆ విధంగా తయారు చేయించిందేమో! అని అనుకున్నాడు మహా

### మధుమాస లయగ్రాహి

కమ్మని లతాంతముల
కు మ్మొనసివచ్చు మధు
పమ్ముల సుగీత నిన
దమ్ము లెసగం, జూ
తమ్ముల లసత్కిసల
యమ్ముల, సుగంధి వకు
ళమ్ములను నానుచు ము
ద మ్మొనర, వాచా
లమ్ములగు కోకిల కు
లమ్ముల రవమ్ము మధు
రమ్మగుచు విన్చె, నని
శమ్ము సుమనోభా
రమ్ముల నశోక నిక
రమ్ములును, జంపక చ
యమ్ములును, గింశుక వ
నమ్ములును నొప్పెన్.

(నన్నయ భారతం నుండి)



" మరల తరళ నవవసంత
మురుగుడెంచె తరులనోహో!
అరుణారుణ కిసలయముల
తరుణాంగుళి విలసనముల "

—ఫోటో: త్రిపాఠ వెంకన్న - కడప.

# సమస్యాపూరణం

రాజు. కాని ఆ భావమేమీ పైకి స్ఫురింపనీయలేదు. పొట్టు లేకపోవడానికి కారణమేమో ఒక చిన్న సమస్యారూపంలో తెలుసుకోవాలని అనుకున్నాడు. వెంటనే కాళిదాస కవి వైపు తిరిగి చిన్ని చిరునవ్వుతో ఇలాగన్నాడు: "ముద్గదాళీ గదవ్యాళీ కవీంద్ర! వితుషా కథం?" 'కవీంద్రా! రోగాలకు నాగుబాములవంటి పెసరపప్పు వంటకంలో పొట్టు లేకపోవడానికి కారణమేమో?" అని ఆ సమస్య తాత్పర్యం.

కవి ఒక నిమిషంసేపూరుకుని నెమ్మదిగా ఆ సమస్య ఇలాగ పూర్తి చేశాడు:

" అంధో వల్లభ సంయోగే
జాతా విగతకంచుకా"

కంచుక పదానికి పొట్టు అనీ రవిక అనీ రెండర్థాలు. అన్నమనే వల్లభునితో కలయికతో పెసరపప్పు పొట్టు (రవిక) జారిపోయినదని దాని తాత్పర్యం.

మహారాజసమస్య విన్న తరవాత కవి సమస్యాపూరణం శ్రద్ధగా ఆలకించిన లీలాదేవి సమస్యాపూరణంలోని శృంగార వ్యంగ్యం గ్రహించుకొని మల్లెమొగ్గలా ఒక చిన్న చిరునవ్వు చిలకరించింది. వెనువెంటనే తలవంచుకొని లజ్జారుణమైన ముఖం మరిఒక పక్కకు తిప్పివేసింది. అయితే అరుణారుణమైన ఆమె కపోలంమీద కర్ణాభరణం తళుక్కున మెరిసింది! కవి దృష్టి ఆ మెరుపు తరగలలో ఉయ్యాల లూగింది! మహారాజు ఈ సన్నివేశం అంతా ఒకకంట కనిపెట్టి చూస్తూనే ఉన్నాడు. అదంతా పరికించి చూచేసరికి అతని కేదో పూర్తిగా అర్థమయిపోయినదని అనిపించింది. మహారాజు కన్నులు జేవురించాయి. అతికష్టంమీద అతడా క్రోధం నిగ్రహించుకొని సమస్యాపూరణం చాలా చక్కగా ఉన్నదని కవిని ప్రశంసించాడు. తరవాత మరిఒక విషయం మీద వేరొక ఛలోక్తి విసిరి అక్కడ ఉన్న వారందరి ముఖాల్లోను చిరునవ్వులు వెలిగించాడు!

అటుపిమ్మట కొంతసేపటికి విందు ముగిసిపోయింది. తాంబూలసేవ జరిగిన అనంతరం కవి స్వగృహానికి బయలుదేరాడు. మహారాజ తని వెంట ఆప్యాయంగా రాజభవనం సింహద్వారంవరకు సాగనంపాడు. కవి మహారాజు తనయెడల చూపించిన ఈ అపూర్వ గౌరవాని కెంతో మురిసిపోతూ తొందరగా స్వగృహం చేరుకున్నాడు.

అనంతరం మహారాజెవరినీ పలకరించనైనా పలకరించకుండా సరాసరి శయ్యాగృహంలోనికి వెళ్లిపోయాడు. శయ్యా

(54-వ పేజీ చూడండి)

# ★ సాగరగర్భంలో సాహస యాత్ర ★

లన్నీ చేసేశాము. ఇద్దరంకలిసి ఒక బగ్గీ ఎక్కాము.

మా సామానంతా ఓడలోకి వెళ్లిపోయింది. మేము కూడా ఓడ ఎక్కాము. వెంటనే నేను కెప్టెన్ ఫరాగూ ఎక్కడ ఉన్నాడని అడిగాను. ఒక నావికుడు నన్నతనిదగ్గరికి తీసుకువెళ్లాడు. అతడు నన్ను చూస్తూనే కరచాలనం చేసి ఎంతో ఆప్యాయంగా గౌరవించాడు. కెప్టెన్ చాలా కులాసా మనిషి.

"ప్రొఫెసర్ అరోనా అంటే మీరేనా?" అన్నాడు కెప్టెన్.

"అవును! కెప్టెన్ ఫరాగూ అంటే తమరేకదూ?"

"అవును! నేనే! మీ కోసం ప్రత్యేకించిన గది సిద్ధంగా ఉంది."

నేనతనికి నమస్కరించి వెంటనే నాకోసం ప్రత్యేకించిన గదిలోకి వెళ్లిపోయాను.

'అబ్రహామ్ లింకన్' అన్ని విధాలా మా విజ్ఞానయాత్రకు తగిన ఓడ. చాలా వేగంతో పోగల యుద్ధనౌక. బాగా జోరుగా పోవడానికి కావలసిన అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఆ సౌకర్యాల మూలంగా అది గంటకు సుమారుగా 18 మైళ్లవరకూ పోగలదు. అయితే ఒక పెద్ద తిమింగిలాన్ని వెంటాడించడానికిమాత్రం ఆ వేగం చాలదు.

నా గదిలో చేసిన ఏర్పాటులన్నీ చాలా బాగున్నాయి.

"ఇక్కడ మనకు చాలా సౌకర్యంగా ఉంది" అన్నాను కౌన్సెల్‌తో.

"అవునవును. చాలాసౌకర్యంగా ఉంది."

కౌన్సెల్ మా సామానులన్నీ జాగ్రత్తగా సర్దుతున్నాడు. నేను మెల్లిగా టాపుమీదికెక్కి ఓడ కదలడానికి చేసే ప్రయత్నాలన్నీ గమనిస్తున్నాను. కెప్టెన్ ఫరాగూ ఓడ కదలడానికప్పుడే ఉత్తరువు జారీ చేశాడు. నేను కనక ఒక అరగంట సేపు ఆలస్యం చేసిఉంటే ఓడ నేను లేకుండానే బయలుదేరిపోయేదే! దానితో నేనీ అత్యద్భుతయాత్రలో పాల్గొనే అవకాశం కాస్తా చెయ్యి జారిపోయేదే! ఇక ఈపైన జరిగినవన్నీ ఉన్నవి ఉన్నట్లుగా రాసినా నమ్మడం కష్టమే! అవి అంతటి అత్యద్భుత విషయాలు.

—ఎలాగైనా ఆ తిమింగిలాన్ని పట్టితీరాలనీ ఇక ఒక్క నిమిషమైనా ఆలస్యం చెయ్యకూడదనీ కెప్టెన్ నిశ్చయించాడు. అటుపిమ్మట అతడు ఓడఇంజనీరును పిలిపించి—

"ఆవిరి బాగా జోరుగా ఎక్కిందా?" అని అడిగాడు.

ఔనన్నాడు ఇంజనీరు.

"అయితే ఓడ జోరుగా పోనీ!" అన్నాడు కెప్టెన్.

అటుపిమ్మట అబ్రహామ్ లింకన్ మాంచి హుందాగా ప్రయాణం సాగించింది. న్యూయార్కు నగర పౌరులు ఆ యుద్ధనౌక అలాగ కదిలిపోతూంటే రెప్పవాల్పకుండా దానికేసి చూశారు. వేలకొలది జనం జేబురుమాళ్లెగరవేస్తూ జయజయ ధ్వానాలు చేశారు.

—ఇంకావుంది.


**అధైర్య పడవద్దు**

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుమా, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టరు రత్నంసన్స్,(Estd 1904)
మలకపేట బిల్డింగ్సు-హైద్రాబాద్-2.
(దక్కన్)


## సమస్యాపూరణం

(12-వ పేజీ తరువాయి)

గృహంలో ప్రవేశిస్తున్న భర్త ముఖ భంగిమ గమనించేసరికి లీలాదేవి కెంతో భయం వేసింది. నెమ్మదిగా పరిచారికచేతనున్న తాంబూల కరండకం చేత ధరించి ఒయ్యారపు నడకలతో నెమ్మదినెమ్మదిగా శయ్యాగృహ ద్వారం చేరుకొన్నది.

మహారాజు శయ్యాగృహంలో ఒక సింహాసనం మీద కూర్చుని తీవ్రంగా ఏదో ఆలోచిస్తున్నాడు. అతని ముఖంలో కత్తివాటు వేసినా నెత్తురుచుక్కలేదు! ఆమె కేమీ పాలుపోలేదు! కరండకంలోనించి ఒక కర్పూరతాంబూలపు చిలక అందీయబోయింది. అతనది స్వీకరించలేదు. పైగా దురుసుగా ఆమె చెయ్యి తోసివేశాడు. ఆ తాకిడికి తాంబూల కరండకం నేలమీద పడిపోయింది. ఆమె జీవితంలో అంతటి అవమానం పొందడానికదే ప్రారంభం! అయినా ఆమె పైపైకేమీ నొచ్చుకోనట్టే నటించి ఒక్క చిరునవ్వునవ్వి "ఇదేమిటీవేళ ఇలాగున్నారు?" అని ఎంతో ఆప్యాయంగా ప్రశ్నించింది. ఆ పైన ఇంకా అతనికి దగ్గరగా వెళ్లింది. భోజుని కామె అనునయం అంతా ఒక కపటనాటకంగా స్ఫురించింది. ఆమె స్పర్శ అగ్నికీలగా సోకింది! ఆమెను చేతికొద్దీ దూరంగా తోసివేశాడు. అతడంత మోటుగా తోసి ఉండకపోవచ్చును. కాని అతి సుకుమారమైన ఆమె శరీరం ఆ అవమానానికీ, ఆ ఆఘాతానికీ నిలబడలేక శయ్యాగృహం ద్వారం ఇవతల పడిపోయింది. వెంటనే ఆమె స్పృహ తప్పిపోయింది. [సశేషం]


స్థాపితము: 1920 సంII రం.
సమస్త చర్మవ్యాధులకు,
తెలుపు మచ్చలు వగైరాలకు చికిత్సా నిపుణులు.
కేటలాగు, సలహా ఉచితము.
రెడ్డి & కో, (రిజిష్టర్డు)
గోపాలపురం, తూర్పు గోదావరి జిల్లా
(వయా) తణుకు.

# సమస్యాపూరణం

ప్రాచీన గాథాలహరి

పి. గణపతి శాస్త్రి

౪

లీలాదేవి అంతవరకు తన జీవితంలో ఎన్నడు అటువంటి అవమానం పొంది ఉండలేదు. ఇంతకీ మహారాజావిధంగా అవమానించడానికిగల కారణమేమో ఆమెకు తెలియలేదు. సామాన్యంగా ఆ దంపతుల మధ్యన ప్రణయకలహాలేమైనావచ్చినప్పుడు అపరాధంఎవరిదైనా చివరికి అనునయించేది మహారాజే. కాని మరునాడంతా వారొకరి ముఖాలొకరు చూచుకోలేదు. లీలాదేవి పైపైకి బాగా బింకంగాఉన్నా లోలోపల అనుక్షణము మహారాజు రాకకోసం ఎదురు తెన్నులు చూచింది. కాని ఆయన రాలేదు. పరిచారికలందరు ఆ పరిస్థితిచూచి హడలెత్తిపోయారు!

లీలాదేవి విందు భోజనం సమయంలో జరిగిన సమస్యాపూరణంలో ఒక చిరునవ్వు చిందించిన మాట వాస్తవమే. దానివలన భర్తకావిధంగా అగ్రహం వచ్చిందని ఆమె విశ్వసించలేకపోయింది.

భోజన సమయంలో అనేకమైన పరిహాస ప్రసంగాలు దొర్లిపోయాయి. ఆ సమయంలో ఆమె ఎన్నెన్నో చిరునవ్వులు చిలకరించింది. ఆయా సందర్భాలలో రాని కోపం సమస్యా పూరణ సందర్భంలో రావలసిన అవసరం ఏమి ఉంది! ఆ సమస్యా పూరణంలో అణువంత మోటుదనం స్ఫురించిన మాట నిజమే. అయితే వెంటనే ఆమె సిగ్గుపడి తలవొంచుకొని ముఖం మరి ఒక పక్కకు తిప్పివేసుకోలేదా? అప్పటి ఆమె ప్రవర్తనలో అనౌచిత్యలేశమైనా లేదే! అందుచేత మహారాజు క్రోధానికది కారణమై ఉండదని ఆమె ఒక నిశ్చయానికి వచ్చింది. దానికి వేరొక ప్రబలమైనకారణమేదో ఉండాలని ఊహించింది. వెంటనే తనకత్యంత విశ్వాసపాత్రురాలయిన అంతఃపుర పరిచారిక మందారమాలికకా విషయం ఆమూలాగ్రంగా గాలించి పట్టుకోవలసిందని ఆజ్ఞాపించింది.

అది జరిగి అప్పుడే రెండు రోజులయింది. మందారమాలిక పరిచారికల నందరినీ అనేక విధాలుగా గుచ్చిగుచ్చి అడిగింది. ఇంతవరకు వారి మూలంగా ఏమీ తెలియలేదు. ఇక మహారాజు ధోరణి చూదామా అంటే ఆయన అంతఃపురంలో ప్రవేశించడమే గగనమైపోయింది. ఆ అగ్రహం నానాటికి మించిపోయినట్లే కనిపించింది. అల్లంత దూరంలో లీలాదేవి ముఖం కనిపించేసరికే మహారాజు మండిపడిపోయేవాడు. ఆ విషమ ఘట్టంలో ఆమెకేమి చెయ్యడానికీ పాలుపోక వెంటనే మందారమాలికను పిలిచింది.

"మందారా! ఏమైనా కొత్తసంగతి తెలిసిందా?"

"ఏమీ తెలియలేదమ్మా"

"ఏమీ తెలియలేదా?"

మందారమాలిక కొంచెం తటపటాయించింది:

"లేదుగాని ఒక్క చిన్న విడ్డూరం జరిగిందనిమాత్రం తెలిసింది."

"ఏమిటో ఆ విడ్డూరం!"

"మహారాజు రాజప్రాసాదంపై అంతస్తు పైకి శయనించి ఉన్నారట! తరంగిక ఆ సమయంలో వింజామర వీస్తున్నదట!"

"ఏ సమయంలో?"

"గడిచిన భృగువాసరం రాత్రి రెండు ఝాముల వేళ"

"ఓహో! అలాగా! సరిసరి! ఆపైన?"

"మహారాజుగారు గడియసేపు నెమ్మదిగా కన్నుమూశారట!"

"సరే! బాగానే ఉంది! ఆపైన?"

"తరవాత తరంగికకూడా అలిసిపోయి ఆ పక్కనే సుఖాసనంమీద మేనువాల్చినదట!"

"ఔరా! ఎంతటి సాహసం! అలా మేను వాల్చడానికి దాని కెన్నిగుండెలున్నాయే?"

"అదేనమ్మా! చాలా చిత్రంగా ఉంది!"

"సరే ఆ తరవాత?"

"తరవాత అది ఏమేమో కలవరించినదట!"

"ఏమని?"

"అంత స్పష్టంగా తెలియదు గాని—

'లీలాదేవీ! కాళిదాసకవి స్త్రీ వేషంతో శయ్యాగృహంలోనికి వచ్చారు. తొందర తొందరగా లోపలికి రండి!' అన్నట్టుగా కలవరించినదట!"

"ఔరా! ఎంతటి విడ్డూరం! ఇంత జరిగినా ఇంకా చిన్న విడ్డూరం జరిగిందంటావేమే! తరవాత ఏమి జరిగింది!"

"ఆమాట వింటూనే మహారాజు మేలుకొని ఆ కలవరింతకు హేతువేమని నొక్కి నొక్కి అడిగినారట!"

"దానికది ఏమని సమాధానం చెప్పింది?"

"ఏదో నిద్రబద్ధకంలో కలవరించాననీ అంతకంటె తనకేమీ తెలియదనీ, తన తప్పిదం మన్నించవలసినదనీ, కాళ్ళావేళ్ళాపడి ప్రాధేయపడి ఎలామాలుకొన్నదట."

ఔరా! ఎంతటి వగలాడి ఆపైన వారేమన్నారే?"

"సరే! అని మన్నించివిడిచిపెట్టారట!"

"ఇదంతా నీకెలాగ తెలిసిందే!"

"దేవరవారికి కర్పూర తాంబూలాలందీయడానికి మెల్లిగా మేడమెట్లెక్కుతూ విన్నాను."

"తరవాత తరంగికను అదేమని అడిగావా?"

"అడిగాను."

"అది ఏమని చెప్పింది?"

"మళ్ళీ తానేమీ ఎరగననీ మీతో చెప్పవద్దనీ వలవలా ఏడ్చింది!"

దానిమాట నిజమే అనిపించిందా?"

"పాపం! అది అమాయకురాలేనమ్మా!"

"అయితే మరి అలాగ ఎందుకు కలవరించిందే?"

"ఏమోనమ్మా! ఎంత తల బద్దలు కొట్టుకొన్నా అదే తెలియడంలేదు!"

"ఓహో! అలాగా! అయితే సరేలే! తరంగిక నొకసారి ఇక్కడికి రమ్మను!"

అని లీలాదేవి మందార మాలికను పంపించివేసింది. పిమ్మట తరంగిక వచ్చింది.

ఆమె ఎన్ని విధాల ప్రశ్నించినా తానేమీ ఎరగననీ ఎందువల్లనో నిద్రమత్తులో ఆ విధంగా కలవరించానని, తనతప్పు మన్నించ వలసిందనీ లీలాదేవి పాదాలు పట్టుకొని పరి పరి విధాలుగా బ్రతిమాలింది.

లీలాదేవి తప్పు వొప్పుకుండా చాలా సేపు తరంగిక ముఖ భంగిమ పరిశీలించింది. పిమ్మట వెంటనే తరంగికను పంపివేసి మందారమాలిక చెవిలో అతిరహస్యంగా ఏమేమో బోధించింది.

౫

మరునాడు దీపదీపాల వేళ లీలాదేవి చక్కగా అలంకరించుకొని నెమ్మదిగా భోజుని సందర్శనానికి బయలుదేరింది మహారాజు శాంతంగా కూర్చుని కొంచెం పరధ్యానభంగిమతో పరిసరోద్యానం తిలకిస్తున్నాడు. సిరి సిరి చీకట్లలో గున్నమామిళ్ల పూలగుత్తులన్నీ లీలగా లేత లేత వెన్నెల వెలుగులో వెలిగాయి. వాటిపై ముసరిన తుమ్మెదల ఝుంకారం వీణామంద్రధ్వనిలా సన్న సన్నగా మారుమోగింది.

లీలాదేవి కొంతదూరంనించే భర్త సౌమ్య దృష్టితో ఉన్నాడని గ్రహించి నెమ్మదిగా ఆయనతో ప్రసంగించవలసిన తీరంతా లోలోపలే ఆలోచించింది. తరంగిక కలవరింతవల్లనే అతనికో విధమైన అపోహ కలిగిందనీ భోజనవేళలో జరిగిన సమస్యాపూరణంలో అది మరింత బలపడిందనీ ఆమె గ్రహించి వేసింది. ఆ విషయంలో లోతుపాతులు గ్రహించడానికే మహారాజు విందు ఏర్పాటుచేసి ఉండవచ్చుననీ సమస్యాపరీక్ష కూడా ఆ దృష్టితోనే జరిగి ఉండవచ్చుననీ ఆమె కొక అనుమానం బయలుదేరింది. ఒక నిమిషం ఆలోచించిన తరవాత ఆ విషయంలో ఇక అనుమానించవలసిన అవసరమేమీ లేదనీ మహారాజావిధంగా సమస్యాపరీక్ష చెయ్యడానికదే కారణమనీ నిశ్చయించివేసింది. భోజనవేళ జరిగిన సంఘటనలన్నీ తిరిగి ఒకసారి స్మరించగానే ఆమె కావిషయంలో బయలుదేరిన అనుమానం పటాపంచలైపోయింది!

అటుపిమ్మట నెమ్మదిగా భోజుని సమీపించి అతనిదరిన కూర్చుని ఆవిషయంలో తాను, కాళిదాసకవీ కేవలం నిర్దోషులమనీ నిజం నిలకడమీద తేలగలదనీ అంతవరకు కొంత నిగ్రహం అవలంబించవలసిందనీ చేతులుపట్టుకొని అనేకవిధాలుగా బ్రతిమాలింది.

కాళిదాసకవి పేరెత్తగానే భోజుడు అగ్గిలో వేసిన గుగ్గిలంలా భగుమన్నాడు.

"ఆ ద్రోహి పేరు మరి నాదగ్గర తలపెట్టవద్దు! ఆ నీచ ద్రోహానికి శూలారోపణ శిక్షే విధించవలసింది! కాని బ్రాహ్మణుడని



"సీతమ్మకు చేయిస్తి
చింతాకు పతకాము, రామచంద్రా!
పతకమునకు బట్టె
పది వేల వరహాలు !"

భద్రాచలంలో భక్తరామదాసు విగ్రహం.

—ఫోటో: వి. వీరయ్య.

# ★ సమస్యాపూరణం ★

కరుణించి నగరనిర్వాసనశిక్షతో విడిచిపెట్టాను."

ఆ మాటవినేసరికి లీలాదేవి హృదయంలో వాడిశూలాలతో పొడిచినట్లయింది! ఒకనిమిషం వరకు ఆమె నోట మాటరాలేదు! తరవాత "అయ్యోయ్యో! ఎంత పని చేశారు! ఆయన ఏ పాపము ఎరగని అమాయకులు!" అన్నది. ఆమె ఎంతో సౌమ్య భావంతో అన్న ఆ మాట లతని హృదయంలో రేగిన క్రోధానికి ఆజ్యధారలా పనిచేశాయి.

"ఇంక ఈ పైన ఆ ద్రోహిమాట నా దగ్గర తలపెడితే మరిసహించేది లేదు!" అన్నాడు అతికర్కశస్వరంతో.

ఆతరవాత ఆమె భర్త పారుష్యం సహించలేకపోయింది. నిర్భయంగా అతని ముఖంవైపు చూస్తూ నెమ్మదిగా ఇలాగన్నది:

"మీరు తరంగిక కలవరింతలు నమ్మి అనవసరంగా అనుమానపడుతున్నారు! కొంచెం ఈ అంగుళీయకం చిత్తగించండి!"

అది మహేశ్వరకవి నామాంకితమైన అంగుళీయకం. ఆ ఉంగరం తరంగిక గృహంలో దొరకిందనీ దానినిబట్టి తరంగికకు మహేశ్వరకవికీ ఏదో సన్నిహిత పరిచయం ఏర్పడినట్లు దృఢపడుతున్నదనీ తరంగిక కలవరింతలకు ఆ అంగుళీయకానికి ఏదైనా సంబంధం ఉండవచ్చుననీ ఇంచుకంత శాంతం వహిస్తే మిగిలిన విషయాలు కూడా ఋజువు కావచ్చుననీ ఆమె అనేక విధాలుగా నచ్చజెప్పింది. మహారాజామాటలతో కొంచెం శాంతించాడు. కొంచం సేపాలోచించి—

"అయితే మహేశ్వరకవి ఇంతటి పన్నాగం పన్నడానికి కారణం?" అని ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నకు లీలాదేవి ఒక చిరునవ్వు నవ్వి—

"దీనికి వేరే కారణం కావలెనా? మీరు కాళిదాస కవీశ్వరులంటే పంచప్రాణాలు ఇస్తున్నారుగదా! మహేశ్వరకవికి లోలోపల ఏమయినా అసూయా క్రోధాలేర్పడి ఉండవచ్చును!...ఇంతకీ ఇలాంటి రాజకార్యవ్యవహారాలలో నేనా తమకు విన్నవించేది!"

అని ఆమె తిరిగీ ఇంకొక చిరునవ్వు నవ్వింది. మహారాజు ఒక్క నిమిషం ఊరుకుని మెల్లిగా ఇలాగన్నాడు:

"ఏమో! ఈ విషయం అంతా నాకు కేవలం అభూతకల్పనలాగే స్ఫురిస్తూంది!"

"ఏ విషయం!" అని ఆమె ఎంతో ఆత్రంగా ప్రశ్నించింది.

"ఈ అంగుళీయక వ్యవహారం!"

"పోనీ! అలాగే కానివ్వండి! ఇందులో మించిపోయినదేమి ఉంది? ఒకసారి మీ గూఢచారుల కాజ్ఞాపిస్తే నాలుగైదు రోజులలో అన్నీ మీకే విశదం అయిపోతాయి. అంతఃపుర పరిచారిక లహోరాత్రాలు నిద్రాహారాలు మాని అతిరహస్యంగా తరంగిక ఇల్లంతా గాలించగా గాలించగా ఈ ఉంగరంసంగతిబయటపడింది...కొంచెం నామాట మన్నించండి!"

తరవాత భోజుడొక కొంతసేపు తటపటాయించి కొంచెం విసుగుగా ఒక నిట్టూర్పు విడిచిపెట్టాడు.

పిమ్మట లీలాదేవి సానునయంగా తిరిగీ ఇలాగన్నది:

"నాకేమో ముప్ఫయిసంవత్సరాలు పైబడ్డాయి. పైగా సంతానవతిని! నేనేమైనా చిన్నదాననా! చితకదాననా! ఇలాంటి శృంగారచేష్టలకు! ఎందుకు మీకింతనుమానం!"

"ఏమో ఎవరు చెప్పగలరు? స్త్రీ హృదయము అత్యంత నిగూఢం!" అన్నాడు మహారాజు.

"ఓహో అలాగా! అయితే ఈవిషయంలో అత్యంత నిగూఢంగా అన్ని రహస్యాలు దాచివేసినవారెవరో! పోనీఇంకొక్కమాట! ధారానగర సుందరీమణులు నిద్రమత్తులో తమపేరే కలవరిస్తూంటారని నగరంలో అందరు అంటూంరు. అంతటి నవమన్మథులు మీరు నన్నెంతో మక్కువగా అక్కున చేర్చుకొని ఆదరంగా చూచుకుంటూ ఉండగా వేరే నాకీ పరపురుష ప్రసంగమేల! నిజానికీ నీలాపనింద మీకే ఒక పెద్ద తలవొంపు! ఈ చిన్న విషయం కొంచెం సావధానంగా ఆలోచించండి!"

ఆ అనునయంతో మహారాజు మనస్సులో కాళిదాసకవి విషయంలో తిరిగీ కొంచెం డోలాందోళన ప్రారంభమైనది. లీలాదేవి అది గ్రహించుకొని మహారాజును తన వామహస్తంతో గాఢంగా కౌగలించుకొని దక్షిణహస్తం మునివేళ్లతో అతని ముంగురులు మెల్లి మెల్లిగా సవరిస్తూ ఎంతో ఆప్యాయంగా ఇలాగన్నది.

"ఇంతకాలంనించీ నన్నెరిగి ఉండినీ నామీద నేటికింతటి నీలాపనింద వేశారుగదా! ఇది మీకేమైనా ధర్మంగాఉన్నదా? ఏమైనా మగమహారాజు లెంతటికైనా తగినవారే!"

అటుపిమ్మట ఆమె కనుగొలకులలో రెండు చిన్న కన్నీటి ముత్యాలు మెరిశాయి.

తరవాత ఆమె దీనంగా మహారాజు ముఖం కేసి చూచింది. కాళిదాసకవిని తిరిగీ ధారానగరానికి పిలిపించవలసిందని ప్రార్థించాలని అనుకొన్నది గాని ప్రస్తుతానికది సముచితంకాదనుకొని ఒక్క నిట్టూర్పు విడిచి అలాగే మౌనంగా మహారాజు ముఖం వైపు చూచింది.

మహారాజు మృదువుగా ఆమె గాఢాశ్లేష బంధనం విడిపించుకొని తన రహస్యమంత్రాగారంలోనికి వెళ్లిపోయాడు. వెంటనే గూఢచారులను, మరి కొంతమంది అంతఃపుర పరిచారికలను తరంగిక కలవరింతను గురించీ, ఆ అంగుళీయకాన్ని గురించీ తరంగికా మహేశ్వరుల అన్యోన్యతను గురించీ వెంటనే అత్యంతరహస్యవృత్తాంతాలందీయవలసిందని ఆజ్ఞాపించాడు. వారందరు రాత్రింబగళ్లదే పనిగా ఆ పరిశీలనలో మునిగిపోయారు.

## ౬

ధారానగర నిర్వాసనం జరిగిపోగానే కాళిదాసకవి మరి ఒక్క క్షణమైనా అక్కడ నిలవకుండా వెంటనే ఆ నగరం విడిచి వెళ్లిపోవాలని నిశ్చయించాడు. అతడు ధారానగరాస్థానానికి వచ్చి అయిదారు నెలలే అయింది. ఆ ఆస్థానంలో ఎన్నడూ లేని గౌరవాదరాలకు లోలోపల ఉప్పొంగిపోతూ త్వరలోనే మాళవదేశంలో ఎక్కడో మారుమూల కుగ్రామం అజక్షీరంలో ఉన్న తన కుటుంబంవారినందరినీ త్వరలోనే ధారానగరానికి తీసుకు రావాలని ఉవ్విళ్లూరాడు. కాని అంతలోనే నగర బహిష్కరణవార్త హఠాత్తుగా ఒక పెద్ద అశనిపాతంలా అతని తలపై విరుచుకు పడింది! ఎంత మథనపడినా అతనికీ అకారణ నగర నిర్వాసనానికి కారణమేమో బోధపడలేదు. విందు సందర్భంలో తన సమస్యాపూరణం దీనికి కొంతవరకు కారణం కావచ్చునని అతని ఊహాంచలాలలో కొంతవరకు స్ఫురించింది. కాని అది ఒక పెద్దహేతువుగా కనబడలేదు! ఎన్నెన్ని విధాలుగా ఆలోచించినా అంత పెద్దకారణం ఏమీ కనబడక పోయేసరికి చివరకతనికి చంచలమైన ప్రభుచిత్తవృత్తులే దీనికి కారణమై ఉండవచ్చునని అనిపించింది. దానితో అతని హృదయంలో వెలిగే ఆశానూర్యోదయ జ్యోతిఅంతా హఠాత్తుగా ఒకేసారిగా అస్తమించిపోయింది!

ఆసమయంలో అతనికి ధారానగరవారాంగన విలాసిని ఆప్యాయత ఆదరాభిమానాలు స్ఫురణకు వచ్చాయి. కడసారిగా ఆమెతో చెప్పి తన స్వగ్రామానికి తిరిగి వెళ్లిపోవాలని నిశ్చయించుకుని తొందర తొందరగా ఆమె భవనంవైపు నడిచి వెళ్ళిపోయాడు.

అప్పటికి ఝామురాత్రి గడిచింది. కాళి

దాసకవి విలాసవతీ భవనద్వారం సమీపించగానే దూరదూరంనుంచి కవిరాక గమనించిన ఆమె ఎంతో ఆప్యాయంగా అతనిని లోలోపలికి తీసుకువెళ్ళిపోయింది.

కవి ఒక అరగడియ సేపామెతో ఇష్టాగోష్ఠి జరిపి నెమ్మదిగా ఆమెకు తన నగర నిర్వాసనశిక్ష తెలియజేశాడు. సూర్యోదయాత్పూర్వమే నగరం విడిచి వెళ్ళిపోవాలనీ లేకపోతే ఆశిక్ష మరణశిక్షగా పరిణమించగలదనీ కడసారిగా ఆమెనుసందర్శించి సెలవుతీసుకుని వెళ్ళిపోవడానికే వచ్చానని అన్నాడు. అటుపిమ్మట సంగ్రహంగా విందు సందర్భంలో జరిగిన సమస్యాపూరణ విషయంకూడా ఆమెకు తెలియజేసి అంతకంటె తానేపాపము ఎరగనని చెప్పి ఆమెతో తన కష్టసుఖాలన్నీ వెళ్ళబోసుకున్నాడు.

విలాసవతి పక్కున ఒక్కనవ్వునవ్వింది:

"ఏమో నేను మీ మాటలు నమ్మను! మీరేమైనా సాధారణులా! లేకపోతే మహారాజంతగా ఎందు కాగ్రహిస్తారు! నిజం చెప్పండి!"

"నిజమే! విలాసవతీ! నేనేపాపము ఎరగను. ఎంత ఒట్టుపెడితే అంతఒట్టు!"

"లేకపోతే లీలాదేవి మనస్సేమయినా కొంచెం చలించిందేమో! మిమ్మల్ని చూచిన తర్వాత ఎలాంటి శీలవతికైనా మనస్సు నిలవరించుకోవడం కష్టమే!"

దీనితో కాళీదాస కవికి కొంచెం కోపం వచ్చింది:

"లోకంలో అంతా నీవంటివారే అనుకుంటున్నావు!" అన్నాడు.

ఈ మాట విలాసవతి హృదయంలో ఈటెలా పొడుచుకుంది.

"అవును! నిజమే! కనకనే మర్యాదస్థులెవరూ నా గడప తొక్కనే తొక్కరు!" అని కోపంగా సమాధానం చెప్పింది.

కవి లోలోపల ఆమె సంభాషణా చాతుర్యానికి మెచ్చుకున్నాడు. అయితే ఆమె కోపం దీపమై వెలిగింది!

ప్రసంగం అవిధంగా పరిణమించ గలదని కవి కలలోనైనా ఊహించలేదు. వెంటనే ఆమె తనమాట అపార్థం చేసుకున్నదని గ్రహించి ఆమెకు తన వాస్తవ మనోభావం తెలియజేసి మన్నించవలసిందని వేడుకొన్నాడు. తరవాత వెంటనే ఇంటికి ప్రయాణమైనాడు. ఆమె దానికంగీకరించలేదు:

"ఎందుకంత తొందర? మీరికనుంచీ నా ఆస్థానంలో కవీశ్వరులు!"

"నీ ఆస్థానంలోనా! సరిపోయింది! ప్రాణం మీదికి వచ్చినా పరిహాసం మానవు గదా!"

"పరిహాసం కాదు! నిజమే! నాలుగు సదస్సులలో నాలుగు నృత్యాలు చేశానంటే మీకు మహారాజు కన్నా పెద్ద సత్కారమే చెయ్యగలను! ఆయనకు నేనెందులో తీసిపోయానో చెప్పండి!"

"ఎందులోను తీసిపోలేదు గాని తెల్లవారితే మాత్రం నా తల తీసేస్తాడు! దీనికేమిటి సాధనం!"

"ఏమీ భయంలేదు! మీ ప్రాణాలకు నా ప్రాణాలు అడ్డు వేస్తున్నాను! సరిగదా!"

"నీవా?"

"అవును నేనే!"

"ఎలాగ?"

"చీర సింగారిస్తే మీరొక భూలోక రంభలాగుంటారు! ఆ వేషంలో మరి మిమ్మల్నెవరు పట్టుకోలేరు!"

"హరిహరీ! చివరికి నీ ఆస్థాన కవీశ్వరుని కెంతటి దుర్గతి పట్టింది!"

ఈ మాటతో విలాసవతి ముక్కుమీద వేలు వేసుకొని పక్కున నవ్వి—

"ఆహా వారాంగనలంటే మీకెంతటి అలుసు!" అని తదేకదృష్టితో అతనివైపు చూచింది!

"తిరిగి నామాట లపార్థం చేసుకుంటున్నావు! నేనీ వారాంగనా వేషంతో ఇక్కడ ఎంతకాలమని కాలక్షేపం చెయ్యగలనో చెప్పు!"

"ఎంతో కాలండాకానా! ఒక పక్షం రోజులు చాలు!"

"ఆ తరవాత?"

"తిరిగి మీ స్వగ్రామం వెళ్ళిపోదురు గాని!"

"అంతవరకు నీ ఎదట నిలబడి గజ్జె కట్టవలసిందేనన్న మాట!"

"నాట్య శాస్త్రవేత్తలు గదా! మీరు స్వయంగా స్త్రీ వేషంలో అభినయిస్తే చూడాలని ఎంతో కాలంనించీ ముచ్చటగా ఉంది! మహారాజుదయవల్ల నేటికది నెరవేరింది! అదీగాక ఇకనించీ మీరు నా ఆస్థాన కవీశ్వరులుగదా! అందుచేత ఈ క్షణంనించీ నా కనుసన్నలలో మెలగాలి!"

"సరిసరి! అయితే నీ ఆస్థానకవినో నర్తకినో నాకింతవరకు స్పష్టంగా తేలలేదే!"

"రెండూను!"

"చాల్చాలులే నీ వేళాకోళం! ఇదంతా నీకొక చిన్న ముచ్చట! నాకు మాత్రం ఒక పెద్ద ప్రాణపోకడ! నీకేమి మహారాజువు! నన్ను పోనీ! నేను వెళ్ళిపోవాలి! ఇంటి దగ్గర ఇల్లాలు, పిల్లలు ఎంతగా బెంగటిల్లిపోతున్నారో!"

ఆ సమాధానంతో విలాసిని చెక్కిళ్ళెర్రబడ్డాయి!

"ఇక్కడున్న నాలుగు పక్షాలు ఇల్లాలో, పిల్లలో అని ఒకటే ఘోష! అంతేగాని కొంచెమైనా నా మాట [illegible]నివ్వరు గదా! పోనీలెండి!"

అని ఆమె మూతి బిగించింది.

"నామాట విను! విలాసవతీ! నాకు వేళ మించిపోతూంది! నేను వెళ్ళిపోవాలి! కొంచెం కనికరించి సెలవు దయచేయించు!"

అన్నాడెంతో జాలిగా కాళీదాసకవి.

ఆమె అతన్ని మృదువుగా కౌగలించుకొని కనురెప్పపాటులేకుండా అతనివైపు సానునయంగాచూచి ఇలాగన్నది:

"నేను కేవలం నా ముచ్చటకోసమే మిమ్మల్నిక్కడ అట్టే పెడుతున్నానని అనుకొంటున్నారా?"

"కాకపోతే దీనివల్ల ప్రయోజనం?"

"ఇంతేనా మీ పరేంగిత జ్ఞానశక్తి!"

కాళీదాసకవి ఈ ప్రశ్నతో తెల్లబోయాడు!

ఒక్క చిన్న చిరునవ్వునవ్వి—

"విలాసవతీ! జితోస్మి!" అన్నాడు.

ఆమె అతన్ని కొంచెం గాఢంగా కౌగలించుకొని చెవిలో మెల్లిగా ఇలాగన్నది:

"ఎందుకు మీకింత తొందరపాటు! లీలాదేవి మీరూ ఏ పాపం ఎరగరుగదా! మహారాజెవరో చెప్పిన చెప్పుడు మాటలువిని మీ మీద ఆగ్రహించి ఉంటారు. అయితే అన్నీ కనిపెట్టి చూచే దైవం అనేవాడు ఒకడు ఉన్నాడు గదా! నిజం అన్నది నిలకడమీద తేలకపోతుందా? ఒక పక్షం రోజులు వేచి ఉంటే మించిపోయేదేమిటి? ఏదో వ్యాకులచిత్తంతో ఉన్నారు గాని — లేకపోతే ఈమాత్రం ఊహ మీకుమాత్రం స్ఫురించక పోయిందా! నామాట విని ఒక పక్షం రోజులు ఓపిక పట్టండి!"

"ఏది ఏమైనా సరే! ఇక నించి నేనీ రాజాధముల ఆస్థానాలు తొక్కేది లేదు!" అన్నాడు కాళీదాసకవి ఒళ్ళెరగని కోపంతో.

"తొందరపడకండి! మన మహారాజును మిగిలిన రాజులతో సరిపోల్చడం ధర్మం కాదు! ఏదో గ్రహపాటువల్ల మీకీ నీలాపనింద వచ్చింది! కొంచెం నిదానిస్తే దానంతట అదే తొలిగిపోతుంది! ఒక్క పక్షంరోజులు ఓపిక పట్టండి! తరవాత మీచిత్తం వచ్చినట్లు చేద్దురు గాని! కొంచెం నా మాట మన్నించండి" అని ఆమె మరింత గాఢంగా అతనిని కౌగిలించుకొన్నది.

విలాసవతి అనురాగానునయశృంఖలలు కాళీదాసకవి హృదయం బంధించి వేశాయి. అలిసి సొలిసిన అతని శరీరం ఆమె దృఢ పరిష్వంగంలో విశ్రమించి కన్నుమూసింది.

—సశేషం.

# సమస్యాపూరణం

## ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

### 8

[గత సంచిక తరవాయి]

ఆనాటికి, విలాసవతి పెట్టిన పక్షం రోజులగడువులోను అప్పుడే పదిరోజులు గడిచిపోయాయి. అంతవరకు ఓరిమి వహించిన కాళిదాసకవి ఆపైన ఇక ఓరిమి వహించలేకపోయాడు. ఆ నాటినించీ తిరిగి తన స్వగ్రామం అజక్షీరం వెళ్ళిపోతానని ప్రయాణమైనాడు. విలాసవతి మాట ఇచ్చిన ప్రకారం మిగిలిన అయిదురోజులు కూడా ఉండి వెళ్ళవలసిందని బలవంత పెట్టింది.

కాని ఆ మరునాటి సాయంకాలం అతని దగ్గరకు వచ్చి ఎంతో గుంభనగా ఒక నవ్వు నవ్వి, అతడింక స్వగ్రామం అజక్షీరం వెళ్ళిపోవాలనీ లేకపోతే ప్రాణభయం కలగగలదనీ భయపెట్టింది. వెంటనే బయలుదేరి పోవాలని కూడా తొందర పెట్టింది. దీనితో కవి పరిస్థితి బాగా విషమించి ఉండవచ్చునని గ్రహించి కంగారు పడ్డాడు. తొందర తొందరగా స్వగ్రామానికి ప్రయాణమైనాడు. అతని తొందరపాటు చూచి విలాసవతి విరగబడి నవ్వింది! ఆ ధోరణిమాచి కాళిదాసకవి నిర్ఘాంతపోయాడు:

"ఎందుకలా నవ్వుతావు!"

"ఊరికే పరిహాసానికన్నాను! మరేమీభయం లేదు లెండి!''

"పెళ్ళికి చెలగాటం! ఎలకకు ప్రాణసంకటం! అన్నట్టుగా ఉంది వ్యవహారం అంతాను! నిజంగా అంతటి ప్రాణాపాయమేమీ లేదా?"

"లేదు!''.

"అయితే వెళ్ళిపొమ్మని నన్నెందుకంతగా తొందరచేశావు?''

''మీ పంచప్రాణాలు అజక్షీరంలో మా అక్కగారిమీదే ఉన్నాయి గదా!... ప్రేమానురాగాల నేవి సహజంగా లోలోపలినించి పుట్టుకు రావాలిగాని కాళ్ళావేళ్ళా పడి ప్రతిమాలితే మాత్రం పుట్టుకు వస్తాయా? అందుకనే మిమ్మల్నింత తొందరగా వెళ్ళిపొమ్మన్నాను!"

"అయితే ప్రస్తుతానికి వచ్చిన ప్రాణభయమేమీ లేదన్న మాట!''

"ఏమీ లేదు!... పైగా మీకొక శుభవర్తమానం కూడా పట్టుకు వచ్చాను."

"నాకా? శుభవర్తమానమా? ఏమిటి చెప్మా అది!"

''ముందుగా నేను కోరుకునే కోరిక చెల్లిస్తానని మాటఇస్తే చెబుతాను.''

"ఏమిటో ఆ కోరిక!''

"ఏమీ లేదు ఒక చిన్న సమస్యాపూరణం! అంతే!''

''అంతేనా? నిలుచున్నపాటుగా నీఎదట గజ్జెకట్టి మేళం చెయ్యమంటావేమోనని భయపడ్డానులే! అది సరే గాని, ఏమిటో ఆ శుభవార్త!

"మహారాజుకు మీ మీద కలిగిన అపోహ యావత్తు తొలిగిపోయిందనీ తాము విధించిన నగర నిర్వాసన శిక్షకెంతైనా పశ్చాత్తాప పడుతున్నారనీ తెలిసింది!''

"నిజమేనా? ఊరికే పరిహాసానికంటున్నావా?"

"పరిహాసం కాదు! నిజమే!"

"నామీద ఒట్టు పెట్టుకో!"

"నేను చచ్చిపోయినంత ఒట్టు! సరికదా!"

"నామీద ఒట్టు పెట్టుకోమంటే నీమీద పెట్టుకున్నావే!"

"అంతటి అఘాయిత్యం మాట అనడానికి నాకు నోరాడలేదు!... నేను చెప్పిన శుభవార్త నిజమే! నామాట నమ్మండి!"

అని నచ్చచెప్పి ఆమె తనకు తెలిసిన శుభవర్తమానం ఆమూలాగ్రంగా అతనికి తెలియజేసింది. మహారాజేర్పాటు చేసిన గూఢచారులు, అంతఃపుర పరిచారికలు నిద్రాహారాలు కూడా మానివేసి తరంగికా మహేశ్వరుల రహస్యవర్తనలన్నీ అతిరహస్యంగా పరిశీలించారు. ఆ పరిశీలనలో తరంగిక గృహంలో వారికొక తాళపత్ర లేఖ దొరికింది. అది మహేశ్వరకవి తరంగికకు వ్రాసిన లేఖ. దానిలో అతడు గూఢచారుల భయంవల్ల తాను కొంతకాలం వరకు తరంగిక గృహానికి రావడం లేదనీ దానికి అన్యథా భావించవద్దనీ ఆ కలవరింతలవల్ల అక్షరాలా అనుకున్నదంతా జరిగిపోయిందనీ వ్రాసి, తరంగిక చాతుర్యం వేయివిధాలుగా ప్రశంసించాడు. లేఖ పఠించిన ఉత్తర క్షణంలోనే అది అగ్నిహోత్రునికాహుతి చెయ్యవలసిందనీ ఆ విషయం మాత్రం విస్మరించవద్దనీ అది అత్యంతావశ్యకమనీ వ్రాశాడు. అయితే తరంగిక మహేశ్వరునిమీది మమకారం కొద్దీ ఆ లేఖ అగ్నిహోత్రునికాహుతి చెయ్యకపోయింది. పైగా అది కళ్ళకద్దుకుని తన అలంకార మంజూషలో ఎంతో ప్రాణపదంగా దాచుకొన్నది. అది ఒక అంతఃపుర పరిచారికకు దొరికింది. వెంటనే అది రాణి లీలాదేవి చేతిలోకి వెళ్ళిపోయింది. ఆమె ఆ లేఖ చేతబుచ్చుకుని తరంగికననేకవిధాలుగా నయానాభయానా బెదిరించింది. యథార్థం తెలియజేస్తే ఏవిధమైన హాని కలగనీయనని అభయప్రదానం చేసింది తరంగిక మరి గత్యంతరం లేక మహేశ్వరకవికీ తనకు మధ్య నడిచిన తతంగమంతా పూసగుచ్చినట్లుగా లీలాదేవికి చెప్పివేసి తనతప్పిదం మన్నించవలసిందని ప్రార్థించి కన్నీరు మున్నీరుగా రాగాలు పెట్టింది. పిమ్మట అదంతా మహారాజుదాకా వెళ్ళిపోయింది. అది వినగానే మహారాజు మనస్సులో పశ్చాత్తాపము, మథన ప్రారంభమైనాయి.

ఆ విషయం అంతా విలాసవతి కాళిదాసకవికి తెలియజేయగానే అప్రయత్నంగా అతని పెదవుల నుండి ఒక్క దీర్ఘనిశ్వాసం వెలువడింది. విలాసవతి ఒక్క చిరునవ్వునవ్వి హేలగా ఇలాగన్నది.

"నేను మొదటినించీ చెబుతూనే ఉన్నాను, తొందరపడవద్దని! నిజం నిలకడ మీద తేలిపోయింది చూశారా!"

"అయితే నేనీవేళ సాయంకాలమే అజక్షీరం వెళ్ళిపోతున్నాను."

"మహారాజుగాని మళ్ళీ పిలిపిస్తారేమో! కొంచెం నిదానించండి!"

"ఏమైనాసరే! తిరిగి నేను మహారాజు ముఖం చూడదలచుకోలేదు! అంతే!"

"పోనీలెండి! మీరు నా ఆస్థానకవీశ్వరులేగదా? ఇంక మహారాజుతో అవసరం ఏముంది! అయితే మరి—నా సమస్య మాటే?"

"నీ సమస్య అంటే!"

# ★ సమస్యాపూరణం ★

"అప్పుడే మరిచారా? నా సమస్య కేమి లెండిగాని—కవితా సమస్యమాటే అడుగుతున్నాను."

"ఆ సమస్య ఎవరిచ్చారో!"

"భోజమహారాజు! అది పూర్తిచేసిన వారిని అక్షర లక్షలతో ఆస్థానమహాకవిగా అభిషేకిస్తారట!"

"ఇక ఈ రాజా స్థానాల గోల నాకేల! నా దారిని నన్ను పోనీ!"

"పోనీ! అది నా కోసం పూర్తిచేసి పెట్టండి!"

"అది నీకెందుకు!"

"ఆ అక్షరలక్షలు, ఆ ఆస్థాన మహాకవి గౌరవము నేనే స్వీకరించాలని అనుకుంటున్నాను!"

ఆమె అలాగనగానే కాళిదాసకవి ఒక్క నిమిషం ఊరుకుని—

"మహా చక్కని ఆలోచన!" అన్నాడు.

ఇక ఆ సమస్యాపూరణంతో ఇక ఆస్థానంలో మిగిలిన క్షుద్ర కవులందర్నీ తలఎత్తుకోకుండా చేయవచ్చుననీ తాను ధారానగరం విడిచివెళ్లిన తరవాత విలాసవతికా మహాకవి గౌరవంకలిగిస్తే అది ప్రస్తుత విషమసమస్యకొక చక్కని పరిష్కారం కాగలదనీ అనుకున్నాడు. వెంటనే అతడామె నా సమస్య తెలియజెయ్యవలసిందని అడిగాడు. ఆమె అది మధురకంఠంతో మెల్లిగా ఇలాగ చదివింది:

"కుసుమే కుసుమోత్పత్తిః
శ్రూయతే నతు దృశ్యతే."

పువ్వులోనించి పువ్వుపుట్టడమనేది వినడమే గాని ఎక్కడా చూడలేదు." అని దాని తాత్పర్యం.

అది వినగానే కాళిదాసకవి "ఇది ఎవరు కల్పించారో గాని చాలా పెద్ద విషమ సమస్యే!" అన్నాడు.

"ఇంకెవరు కల్పించగలరు! మన మహారాజే!"

"ఈ సమస్య ఎందుకిచ్చినట్లో!"

"ఏమో ఏమీ తెలియడంలేదు!"

"ఇన్ని అత్యంత రహస్య విషయాలు పట్టుకొన్నావుగదా! ఇది ఒక్కటీ మాత్రం తెలియలేదా!"

"మందారమాలికకూడా దీని అంతేమిటో తెలియడంలేదని అంది!"

"అయితే మందారమాలికద్వారా నీకిన్ని తెలుస్తున్నాయన్నమాట!"

"అన్న మాటేమిటి? అదేనా గూఢచారకనీ! - ఇంతకీ మహారాజీ సమస్య ఎందుకిచ్చారో మన కెందుకు? పూరించడమే మన వంతు! దయచేసి కొంచెం పూరించి పెట్టండి!"

అటుపిమ్మట కాళిదాసకవి కనురెప్ప వేయకుండా ఆమె ముఖభంగిమ గమనించాడు. అలాగ రెండు మూడు నిమిషాలు గడిచిపోయాయి! కవి తరవాత "బాలే! తవ ముఖాంభోజే దృష్టమిందీవరద్వయం" అని ఆ సమస్య పూర్తిచేశాడు.

"ఓ చిన్నదానా! నీ ముఖ పద్మమందు రెండు నల్లకలవలు కనిపించాయి!" అని ఆ పాద తాత్పర్యం!

కవి వెంటనే శ్లోకం అంతా ఇలాగ చదివాడు.

"కుసుమే కుసుమోత్పత్తిః
శ్రూయతే నతు దృశ్యతే!
బాలే! తవ ముఖాంభోజే
దృష్టమిందీవరద్వయమ్!"

అది వినగానే విలాసిని ఆశ్చర్య విస్ఫారిత నేత్రాలతో కవివైపు చూచింది. కాళిదాసామె అరుణాధరంమీద దృష్టి నిలిపి—

"ఇంత చక్కగా పూరించానుగదా! మరి దీనికి సత్కారం మాట!" అన్నాడు.

"చాల్లెండి, మీ కొంటెతనం!" అంటూ విలాసిని అక్కడినించి పారిపోయింది!

౮

తరంగిక కేవలం గత్యంతరం లేకపోవడం వల్లనే తన తప్పిదం ఒప్పుకొన్నది. దాని మూలంగా ఆమె కేవిధమైన హానీ కలగలేదు. అయితే లీలాదేవి అప్పటినించీ ఆమెను అంతఃపురంలో సామాన్య పరిచర్యా నిర్వహణలో మాత్రమే వినియోగించింది. అంతే గాని మిగిలిన విషయాలలో ఆమె కేవిధమైన హానీ కలగనీయలేదు.

అయితే తరంగిక తాను చెప్పిన వృత్తాంతం మూలకంగా మహేశ్వర కవి కేమైనా అపకారం జరగవచ్చునేమోనని లోలోపల చాలా భయపడింది. వెంటనే ఒకనాడతిరహస్యంగా మహేశ్వర కవి కా తాళపత్ర లేఖా వృత్తాంతం అంతా తెలియజేసింది. అతడది విని హడలిపోయి వెంటనే కృష్ణ కళింగ కవులిద్దరికీ ఆ వ్యవహారం అంతా ఆమూలాగ్రం తెలియజేశాడు.

కృష్ణకవి ఇది వినగానే వ్యవహారం అంతా బాగా చెయ్యిదాటిపోయిందనీ క్రమంగా ఈ పెనుప్రళయం అంతా కళింగ కవిమీద, తనమీద కూడా విరుచుకుపడవచ్చుననీ భయపడ్డాడు. మొదటి నించీ అతడీ విషయంలో చాలా చాకచక్యంతో వ్యవహరిస్తున్నాడు. కాళీదాస కవికి నగర నిర్వాసనం జరిగినప్పటినించీ తరుచుగా తరంగిక గృహానికి వెళ్లవద్దనీ, గూఢచారులతిరహస్యంగా ఆ విషయం పరిశీలిస్తున్నారనీ మహేశ్వరకవిని హెచ్చరించినవాడు కృష్ణకవే! అయితే తరంగిక వ్యవహారం అంత తేలికగా బయటపడిపోగలదని అతడూహించలేదు. కాళీదాసకవి నగరనిర్వాసనానికి లోలోపల ఎంతో సంతోషిస్తున్న కవిత్రయం వారందరికీ ఇటీవల జరిగిన ఈ రహస్య భంగంతో ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. దాంతో ఎవరిమట్టుకు వారే ఆత్మగౌరవ సంరక్షణలో పడిపోయారు. కృష్ణ కళింగ కవులిద్దరు క్రమక్రమంగా మహేశ్వరకవిని కొంచెం దూరం దూరంగా నెట్టివెయ్యడం మొదలు పెట్టారు. కాని పైపైకి బాగా ఆప్యాయత కనబరచడం మాత్రం మానలేదు. మహేశ్వర కవికి విషమసమస్యలో ఏమి చెయ్యడానికీ పాలుపోలేదు. తనకిక కృష్ణకవి ఒక్కడే ఆపద్ధుద్ధారకుడు కాగలడని నమ్మి అతన్నే అంటిపెట్టుకుని తిరిగేవాడు.

ఆ విషయంలో వారిలో వారు రావిధంగా మథనపడుతూండగా హఠాత్తుగా ఆ నూతన సమస్యాపూరణ వృత్తాంతం తెలిసింది. మహారాజీవిధంగా నూతన సమస్య ఇవ్వడానికిగల కారణమేమో వారెవ్వరికీ బోధపడలేదు. కాళీదాసకవి నగరనిర్వాసనం జరిగిన తరవాత మరి ఒకరినెవరినైనా ఆస్థాన కవిగా అభిషేకించడానికే మహారాజావిధంగా నూతన సమస్యాపూరణం ప్రకటించి ఉండవచ్చునని వారిలో వారొక నిర్ణయానికి వచ్చారు.

ఆ ఆపత్సమయంలో వారికా సమస్య సముద్రంలో మునిగిపోయేవారికొక నావలా భాసించింది. ఆపైన కృష్ణకవి ప్రతిభ ఆ విషయంలో బాగా చురుకుగా పనిచేసింది: ఎలాగైనా మహేశ్వర కవిచేత ఆ సమస్య పూర్తిచేయిస్తే తమకందరికీ ప్రస్తుతం వచ్చిన ప్రమాదం తొలగిపోతుంది. మహారాజు మాట ఇచ్చిన విధంగా అతన్ని ఆస్థాన మహాకవిగా అభిషేకించక తప్పదు. దానితో మహేశ్వర కవికి ప్రస్తుతం వచ్చిన ప్రమాదం అంతా పూర్తిగా తొలగిపోవచ్చును. ఇంకొక విషయం: ఆస్థాన మహాకవి అయినా అతనికి తన సాహాయ్యము, కళింగకవి సాహాయ్యము చాలా అవసరం. ఆ విధంగా తనకు, కళింగ కవికి అతడొక పెట్టని కోటగా ఏర్పడగలడు.

అధైర్య పడవద్దు
శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉండుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.
డాక్టరు రత్నం సన్స్,(Estd 1904)
మలకపేట బిల్డింగ్సు-హైద్రాబాద్ -2
(దక్కన్)

అందుచేత ముగ్గురు వేర్వేరుగా మూడు విధాలుగా సమస్యలు పూర్తిచేసినా వాటిలో ఉత్తమమైనదానికి మహేశ్వరకవికర్తృత్వం ఆరోపించటం ప్రస్తుతానికి అత్యంతావశ్యకమనీ, అది అన్నివిధాలా తగిన తరుణోపాయమనీ కృష్ణకవి నిశ్చయించాడు. కళింగకవికూడా ప్రస్తుతానికది ఒక్కటే తరుణోపాయమనీ అంతకంటె మరి గత్యంతరమేమీ లేదనీ వంతపాడాడు. మహేశ్వరకవి కృష్ణకవిచాతుర్యానికీ పరోపకారపారీణతకు ఉప్పొంగిపోయి అతని ననేక విధాలుగా ప్రశంసించాడు.

అటుపిమ్మట ముగ్గురు వేర్వేరుగా మూడు విధాలుగా ఆ సమస్య పూర్తిచేశారు. ఆ సమస్యాపూరణాలన్నిటిలోనే కళింగకవిదే సర్వోత్తమంగా ఉన్నదనీ ధారానగరకవివర్గంలో అమాత్రం చమత్కారయుక్తంగా సమస్య పూర్తిచెయ్యగలవారెవ్వరు లేరనీ కృష్ణకవీ, మహేశ్వరకవీ కూడా మెచ్చుకొన్నారు. వెంటనే అది మహేశ్వరకవి పేరిట మహారాజసన్నిధికి పంపించివెయ్యాలని నిశ్చయించారు.

అది పంపివేసిన మర్నాడు కృష్ణ కళింగ కవులిద్దరు కృష్ణకవిగృహంలో సమావేశమైనారు. కొంతసేపటివరకు ఏవేవో మంతనాలు సాగించారు. కళింగకవికి ప్రస్తుతం మహేశ్వరకవికి రాబోయే ప్రమాదం అంత తేలికగా తొలగిపోయేది కాదనీ, మహారాజుకు మహేశ్వరకవిమీద కలిగిన అగౌరవభావం, అతని సంసర్గంవల్ల క్రమక్రమంగా తమమీదకూడా ప్రసరించవచ్చుననీ భయంవేసింది:

"ఒకవేళ ఇంతకన్నా మనోజ్ఞంగా ఈ సమస్య పూర్తిచేసినవారెవరైనా ఉంటే మరి మహేశ్వరకవి గతి ఏంకావాలి?"

"అలాంటివారెవరు ఉంటారనే నా నమ్మకం!" అన్నాడు కృష్ణకవి.

"ఆసమస్యాపూరణం తిరిగి పత్తిస్తేనాకేమీ అంత భరవసా కలగడంలేదు. అదీగాక మహారాజు అభిరుచి ఏవిధంగా మొగ్గుతుందో ఎవరు చెప్పగలరు? ఇంతకీ మహారాజ సన్నిధికి వచ్చిన సమస్యాపూరణాలన్నీ మనం చూడలేదుగదా!"

"పోనీవయ్యా! గాలీ వానా వస్తే కథే లేదు!"

"అంటే?"

"ఈ సమస్యాపూర్తితో మరొకరెవరైనా ఆస్థాన మహాకవిఅయితే మహేశ్వరకవి మరి ఈ ఆస్థానానికి తిలోదకాలు వదులుకోవలసిందే!"

"తీరా మోసి అతడిదంతా మనమీద తోసివేసి తానేపాపము ఎరగనని చల్లగా తప్పుకుంటేనో?"—

"అనగానే సరా? ప్రబలమైనటువంటి ఆధారం ఉండవద్దూ?"

"ఏమైనా అది మహారాజు హృదయంలో కొంచెం అనుమాన విషబీజం నాటించడానికి చాలునుగదా!"

"దానివల్ల అతనికి వచ్చే లాభం?"

"ఆత్మరక్షణ!"

"అది నాకు కొంచెం స్ఫురించక పోలేదు!...అయితే వ్యవహారం అంతా మొదటికివచ్చే సూచన లేమైనా కనిపిస్తే వెంటనే అతని హృదయంలో భీతావహం పుట్టించి చల్లచల్లగా పలాయనమంత్రం పునశ్చరణ చేయించేస్తాను!"

"లేకపోతే మన ప్రాణాలకే మోసం రావచ్చును! అది గమనించారా?"

"ఇవ్వన్నీ నేను మొట్టమొదటే అనుమానించానయ్యా!...అయితే ఆ దాసీపిల్ల ఇంత కొంప ముంచుతుందని ఊహించలేక పోయాను! అంతే!"

"అదిమాత్రం ఏంచేస్తుంది! తీరామోసి అదంతా విరగబడి మీదపడేసరికి తన పంచప్రాణాలు దక్కించుకుని బయటపడింది!"

"మహేశ్వరకవి ప్రాణాలకు తన ప్రాణాలడ్డువేస్తుందేమోనని అనుకున్నాను గాని చిట్టచివరికి అతని ప్రాణాలే తనప్రాణాలకడ్డు వేసుకుంది!"

"ఇక మన కర్తవ్యము అంతే!"

"సరే! అప్పటిమాట ఆలోచిద్దాము. ఈ ఘడియవరకు వ్యవహారం మించిపోలేదుగదా!"

పిమ్మట వారిద్దరు స్వగృహాలకు మరలిపోయారు.

౯

తరవాత కొంతకాలానికి ధారానగర కవీశ్వరులందరు పంపించిన సమస్యాపూరణాల పరీక్ష జరిగింది. దానికి ధారాధిపతి భోజమహారాజేకాక మరి ఇద్దరు విద్వత్కవులు కూడా పరిశీలకులైనారు. ఆ సమస్యాపరీక్షకు కృష్ణ కళింగమహేశ్వరకవులేగాక ఇంకా మిగిలిన ధారానగరకవులు, విలాసిని మొదలయినవారెందరెందరో తమ శ్లోకాలు పంపించారు.

శ్లోకాల పరిశీలన ఆయాకవి నామధేయాల ప్రసక్తి లేకుండా నిష్పక్షపాతంగానే జరిగింది. కాని ఆ పరిశీలన ముగిసేసరికి భోజమహారాజు, మిగిలిన ఇద్దరు విద్వత్కవులు ఆశ్చర్యచకితులైనారు. సమస్యాపూరణాలన్నిటిలోను ఒకేఒక్క సమస్యాపూరణం ఉత్తమోత్తమమని పరిశీలకులు ముగ్గురు ఏకగ్రీవంగా నిశ్చయించారు. ఆ నిశ్చయానికి పూర్వం వారికది రచించినవారెవరో తెలియదు. నిర్ణయం జరిగినతరవాత వారందరికీ ఆ కవి నామధేయం తెలుసుకోవాలనే ఉత్కంఠ బయలుదేరింది. అది విలాసిని!


నిగనిగలాడు దీర్ఘ కుంతలాలకు

కేశవర్ధనిని




తలలోని చుండును పోగొట్టండి.



కురుపులను, దురదను మాన్పండి. వెంట్రుకలు రాలటం ఆపండి. అకాలంలో వెంట్రుకలు యెందుకు నెరియాలి? నెరియటం ఆలస్యం కానివ్వండి.

కేశవర్ధనితో కేశాలకు క్రొత్త కళ చేకూర్పండి.

కేశ శుభ్రతకు. సువాసనషాంపూ వాడండి.

కేశవర్ధిని అ. 14; షాంపూ అ. 14. పోస్టేజి అదనం. అన్నిచోట్లా లభించును.

కేశవర్ధని ప్రాడక్ట్సు, కోయంబత్తూరు.

నేషనల్ సేల్సు & సర్వీసెస్(సదరన్) లిమిటెడ్. బకింగ్‌హాంపేట, బెజవాడ NO 4

# సమస్యాపూరణం

ఆ పేరు వినబడేసరికి వారు ముగ్గురు తాము మేలుకొన్నామా! కలలు గంటున్నామా! అని ఆశ్చర్యపోయారు!

విలాసిని అంతఃపురార్యం ఎన్నడు గీర్వాణకవయిత్రిగా పేరుపొంది ఉండలేదు. కావ్య నాటకాలంకారాలలో ఆమెకు కొంత విద్వత్తు ఉన్న మాట వాస్తవమే! అంతమాత్రంచేత రసవత్తరమైన ఆ సమస్యాపూరణం ఆమె రచించినదే అనడానికి వారెవ్వరు సాహసించలేకపోయారు. ఆమె నామధేయంతో ఆ సమస్యాపూరణం పంపించిన తరవాత అది కాదనడానికి ఎవరికీ నోరాడలేదు.

ఈ విషయంలో ఎటు నిర్ణయించడానికి పాలుపోక మహారాజు ఆమెను ఒకసారి దర్శనానికి రావలసిందని కబురు పంపించాడు. విలాసిని తన సన్నిధికి రాగానే ఆమె కవితా చాతుర్యం అభినందిస్తూ ప్రశంసించాడు. దానికామె ఉబ్బి తబ్బిబ్బైపోలేదు.


## బహుమతి రు. 500

(గవర్నమెంటు రిజిస్టర్డు)

తెల్ల వెంట్రుకలను పోగొట్టును

రంగులనుచూచి మోసపోవద్దు. అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపక శక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగానెరసివుంటే ఒక సీసా రు. 3-8-0; 3 సీసాలు రు. 9-0-0 సగము నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/- లు. ఇది పనిచేయదని నిరూపించిన రు. 500/-

GENERAL LABORATARIES,
(H. O) P. O. Rajdbanwar (H, Bhag).


ఒయ్యారంగా తల ఒంచుకొని—"మహాకవులు పొందవలసిన ఈ మహా గౌరవం నావంటి అల్పురాలికి వచ్చిందే!" అని కొంచెం కించపడుతున్నాను. అయితే ఇదంతా మీ అపారమైన ఔదార్యం మాత్రమే!" అన్నది.

"నీ మూలాన నేటికి మా ఆస్థానాని కాలోటు తీరిపోయిందే!"

"కాని కాకి బంగారం మేలిమి బంగారం కానేరదు కదా!"

ఆమె మాటలలో భోజునికేదో నిశితవ్యంగ్యం స్ఫురించింది. నిశ్చలంగా ఆమెకేసి చూస్తూ నెమ్మదిగా ఇలాగన్నాడు.

"నీ మాటలు నాకర్థం కావడం లేదు!"

"అర్థం కాకపోవడానికి మీకు తెలియనిదేమున్నది! అయితే అపరాధం మన్నిస్తామని అభయ ప్రదానం చేస్తే ఉన్న విషయం కాస్తా తమ ఎదట మనవి చేస్తాను!"

మహారాజంగీకారసూచకంగా శిరఃకంపం చేశాడు.

"ఈ సమస్యపూరించింది నేను కాదు!"

"ఎవరా మహాకవి?"

"కాళీదాస మహాకవి!"

"ఆయన అజక్షీర గ్రామానికి మరలిపోలేదా?"

"మరలిపోతే ఈ సమస్య ఇంత హృదయంగమంగా ఎవరు పూరించగలరు?"

"అయితే ఆయన ధారానగరంలోనే ఉన్నారన్న మాట!"

"అవును! అదే! నా మహాపరాధం!" అని చెప్పి విలాసవతి కాళీదాస కవికి నగర నిర్వాసన శిక్ష విధించినది మొదలుకొని అప్పటివరకు జరిగిన విషయాలన్ని సంగ్రహంగా అతనికి తెలియజేసింది. అది విని మహారాజామె చాతుర్యానికెంతో మెచ్చుకొని సగౌరవంగా సత్కరించాడు! కాళీదాసకవిని తన అపరాధం మన్నించవలసిందని కోరడానికై ఆనాటి సాయంకాలమే ఆమె భవనానికి బయలుదేరి వస్తున్నాననీ కవిపట్టిన పట్టు సడలించేటట్టు చూడవలసిందనీ ఆమెతో అన్నాడు.

తరవాత ఆ వార్త క్రమక్రమంగా ధారానగరం అంతటా పాకిపోయింది. కృష్ణకళింగ కవులిద్దరు ఆ వార్తకు చిలవలు, పలవలు కల్పించి మహేశ్వరకవి గుండెల్లో పెద్దపులులు పరిగెత్తించారు! మహేశ్వరకవి ఆనాటి సాయంకాలం సంజచీకట్లలో తలదాచుకుంటూ చల్లచల్లగా ధారానగరం విడిచి పారిపోయాడు! పైపై కెంతో విచారం వెళ్ళగక్కినా కృష్ణకళింగ కవులిద్దరు ఆ సంఘటన చూచి అమితానంద భరితులైనారు.

విలాసవతి తొందర తొందరగా స్వభవనానికి మరలివచ్చి చిన్న చిన్న ఛలోక్తుల తోను, పరిహాసాలతోను కాళీదాస కవికా శుభవర్తమానం అంతా తెలియజేసింది. అపరాధ క్షమాపణకోసం స్వయంగా మహారాజే విలాసవతీ భవనానికి వస్తున్నారనే వృత్తాంతం వినగానే కాళీదాసకవికి అంతఃపురార్యం మహారాజుపై కలిగిన ఆగ్రహం అంతా ఒక్కసారిగా పటాపంచలై పోయింది! విలాసవతి ఔదార్యం తలుచుకోగానే కవి కంఠంలో గద్గదిక పొడచూపింది.

కాని విలాసవతి అతన్ని వెంటనే అజక్షీర గ్రామానికి వెళ్ళిపొమ్మని శాసించింది! నిర్ఘాంతపోయి నిలుచున్న అతన్ని గది గుమ్మం బయటికి నెట్టివేసి ధామ్మని గదితలుపులు బిగించివేసి లోపల గొళ్ళెం పెట్టింది! తరవాత దీపదీపాల వేళదాకా అతడెంత బతిమాలుకొన్నా ఆమె మరి తలుపులు తెరవనేలేదు!

పిమ్మట మహారాజు విలాసవతీ భవన ద్వారం సమీపించడమూ, ఆమె ఆ తలుపు తియ్యడమూ ఒక్కసారిగానే జరగాయి!

ఆ మరునాడే కాళీదాసకవి భోజరాజాస్థాన మహాకవిగా పట్టాభిషిక్తుడైనాడు.

ఆ సమయంలో అక్షరలక్షలతని శిరస్సుపై సువర్ణ పుష్పాంజలిలా ప్రకాశించాయి! ఆ మహా గౌరవం కృష్ణ కళింగ కవులిద్దరు ప్రశంసించినంత గొప్పగా తదితర కవులెవరు ప్రశంసించలేకపోయారని ధారానగర విద్వత్కవులలో ఒక మహా కల్లోలం చెలరేగింది! ★




ఫిలిప్స్

★

BCA 645 A

7 వాల్వులు, 6 బాండ్సు ఎ. సి. రేడియో

ధర: రు. 650/-

మోడరన్ ఆటో స్టోర్సు, విజయవాడ-1.



## కలవరపడు స్త్రీలకు



"కుమారి" (మాత్రలు) మరువకండి మీ ఆరోగ్యం రక్షించును. చింతఅనవసరం

డెం (సాదా) రు. 3/-
(స్పెషల్) 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజి ప్యాకింగ్ ప్రత్యేకం

Mrs. P. Devee, F.D S. (AP) Calcutta-40.

స్టాకిస్టు: Indo Medical supplies

No. 3, Paullappan st, Seven wells Madras-1.